సాక్షి
విజయనగరం
ఆదివారం । 23 । జూలై । 2023

న్యూస్‌రీల్

ఉపాధి కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం అర్బన్: డీఆర్‌డీఏ, సీడ్‌యాప్ సంయుక్త నిర్వహణలో టీటీడీసీ మహిళా ప్రాంగణంలో నిర్వహిస్తున్న స్కిల్ కాలేజీలో ఉపాధి కోర్సులకు నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని డీఆర్‌డీఏ పీడీ కళ్యాణచక్రవర్తి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణ కాలం 4 నెలలు ఉన్న కోర్సులకు ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. శిక్షణ కోర్సులలోని కెమిస్ట్ ప్రొడక్షన్ కోర్సుకు బీఎస్సీ కెమిస్ట్రీ, బీజెడ్‌సీ, బి.ఫార్మసీ విద్యార్హత, రిటైల్ సేల్ సూపర్ వైజర్‌కు ఇంటర్/డిగ్రీ విద్యార్హతగా పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు బయోడేటా, విద్యార్హతల ధ్రువపత్రాలు, రేషన్, ఆధార్, రెండు పాస్‌ఫొటోలు జెరాక్స్ కాపీలతో టీటీడీసీ, మహిళా ప్రాంగణంలోని కార్యాలయానికి ఈ నెల 24వ తేదీన నేరుగా హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాల కోసం సెల్: 80747 26936, 73867 13880 నంబర్లను సంప్రదించాలన్నారు.

బలిజిపేటవైపు ఏనుగులు



కొరటాం నుంచి బలిజిపేట మండలం వైపు వెళ్తున్న ఏనుగుల గుంపు

తెర్లాం: ఏనుగుల గుంపు కొల్లివలస, వంతరాం మీదుగా బలిజిపేట మండలం పలగర వైపు శనివారం వెళ్లాయి. మండలంలోని కొరటాం, రంగప్పవలస, తమ్మయ్యవలస తదితర గ్రామాల్లో ఐదు రోజులపాటు సంచరించి ప్రజల, రైతులను భయాందోళనకు గురిచేసిన ఏనుగుల గుంపు తెర్లాం మండలాన్ని వదిలి వెళ్లి పోయాయన్న వార్తతో ఊపిరి పీల్చుకున్నారు.

చాగంటి తులసికి సాహిత్య పురస్కారం



సాహిత్య పురస్కారాన్ని చాగంటి తులసికి అందజేస్తున్న నిర్వాహకులు

విజయనగరం టౌన్: బలివాడ కాంతారావు స్మారక జీవిత సాఫల్య సాహిత్య పురస్కారాన్ని రచయిత్రి చాగంటి తులసికి నిర్వాహకులు శనివారం ఆమె స్వగృహంలో అందజేశారు. పురస్కారంతో పాటు రూ.25వేలు నగదు, జ్ఞాపిక, దుశ్శాలువతో భారత నిధి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డి.ఎస్.వి.గోపీకృష్ణ సత్కరించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు మేడ మస్తాన్‌రెడ్డి, డి.దుర్గాప్రసాదరావు, డీవీజీ శంకరరావు, పి.భోగారావు, మంజరి, ఎస్.కె.బాబు, పాల్గొన్నారు.

అడ్డంకులన్నీ తొలగించి... అభివృద్ధి పథం



- అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమీక్ష సమావేశాల లక్ష్యం
- క్షేత్రస్థాయిలో అడ్డంకులను తొలగించి పనులు వేగవంతం
- వలంటీర్ల వ్యవస్థపై అపవాదులు ప్రతిపక్ష నాయకులకే నష్టం
- ఐదేళ్లలో ఏంచేశారో చెప్పకోలేనివిధంగా చంద్రబాబు పాలన
- నాటికి నేటికీ నక్కకు నాకలోకానికి ఉన్నంత తేడా..
- 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి బూడి ముత్యాలనాయుడు

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

అడ్డంకులన్నీ క్షేత్రస్థాయిలోనే పరిష్కరించి నియోజకవర్గాల వారీగా అభివృద్ధికి దోహదం చేయడానికి నియోజకవర్గంవారీ సమీక్ష సమావేశాలు ప్రారంభించామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు చెప్పారు. జిల్లాలో తొలిసారిగా విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గంలోని సమస్యలను, అభివృద్ధి పనుల ప్రగతిపై శనివారం ఆయన సమీక్షించారు. అనంతరం జెడ్పీ అతిథిగృహంలో 'సాక్షి ప్రతినిధి'తో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

పనుల ప్రగతిపై సమీక్ష

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కో వారం ఒక్కో నియోజకవర్గంలో అభివృద్ధి పనుల ప్రగతిపై సమీక్షించాలని ఇన్‌చార్జి మంత్రులను ఆదేశించారు. ఆ మేరకు సంబంధిత ఎమ్మెల్యే, కలెక్టర్, అధికారులను ఒక వేదికపైకి తీసుకొస్తున్నాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగేళ్ల కాలంలో అభివృద్ధి కార్యక్రమాలకు ఏయే నిధులు మంజూరయ్యాయి? ఏ మేరకు పనులు జరిగాయి? ఎక్కడైనా ఆలస్యమవుతున్నాయా? వాటిని త్వరితగతిన పూర్తి చేయడానికి ఉన్నటువంటి అడ్డంకులను శాఖలవారీగా ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రస్తావిస్తారు. అవన్నీ మినిట్స్‌లో నమోదవుతాయి. జిల్లా కలెక్టరు స్థాయిలోనివైతే తక్షణమే పరిష్కరిస్తున్నాం. అంతకుమించినవైతే రాష్ట్ర స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం. అవసరమైతే ముఖ్యమంత్రి కార్యాలయానికి (సీఎంఓకు) పంపిస్తాం.

ప్రజాశ్రేయస్సే అంతిమ లక్ష్యం...

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ కార్యక్రమం తలపెట్టినా ప్రజాశ్రేయస్సే అంతిమ లక్ష్యం. ఇప్పటికే గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతి గడపకూ వెళ్తున్నారు. ఆ కుటుంబం అర్హత మేరకు సంక్షేమ పథకాలన్నీ అందుతున్నాయా లేదా అనేది పరిశీలిస్తున్నారు. తక్షణమే దాన్ని పరిష్కరిస్తున్నారు. ఇక గ్రామానికి అవసరమైన పనులనూ త్వరితగతిన చేపట్టేందుకు అవసరమైన నిధులు రూ.20 లక్షల వరకూ ఎమ్మెల్యే మంజూరు చేస్తున్నారు. అలాగాకుండా నాలుగైదు గ్రామాలు లేదా నియోజకవర్గంలో అధిక ప్రాంతానికి ప్రయోజనం కలిగించే పని ఏదైనా పెండింగ్‌లో ఉంటే దాన్నీ సత్వరమే చేపట్టడానికి ఈ నియోజకవర్గాల వారీ సమీక్ష ఉపయోగపడుతుంది.

అద్భుతమైన 'జగనన్న సురక్ష'...

ప్రభుత్వ సేవలను పైసా రుసుం లేకుండా ప్రజల చెంతకే వెళ్లి అందిస్తున్న అద్భుతమైన కార్యక్రమం జగనన్న సురక్ష. గతంలో వ్యయప్రయాసలు పడితే కానీ రాని ధ్రువీకరణ పత్రాలను ఇప్పుడు దరఖాస్తు చేసిన రోజునే అందిస్తున్నారు. ఒక మంచి వ్యక్తి నాయకత్వంలో ప్రభుత్వపాలన తాలూకు ఫలాలతో ప్రజలు ఎంతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఇతర రాష్ట్రాలకు ఆదర్శప్రాయం...

ప్రభుత్వ సేవలను, సంక్షేమ పథకాలను అవినీతికి ఆస్కారం లేకుండా అర్హతే ప్రామాణికంగా ప్రజలకు చేర్చడానికి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రారంభించిన వలంటీర్ల వ్యవస్థ ఇప్పుడు ఇతర రాష్ట్రాలకు ఆదర్శప్రాయంగా మారింది. ఇది మంచిది గాకపోతే వారు ఇటు చూడరు కదా?

వలంటీర్ల సేవలపై వాళ్లకు కన్నెర్ర...

ఓ యాభై ఇళ్లవారికి ఒక వలంటీరు ఆత్మబంధువు. ప్రపంచాన్నే వణికించిన కరోనా మహమ్మారి నుంచి వారిని కాపాడుకోవడానికి క్షేత్రస్థాయిలో వారు అందించిన సేవలు అమోఘం. కరోనాతో బయటప్రాంతాల నుంచి వచ్చినవారిని గుర్తించడమే కాదు తమ పరిధిలో ఎవరికి ఎప్పుడు వ్యాప్తి చెందినా వెనువెంటనే ఆస్పత్రులకు తరలించడంలో కీలక పాత్ర పోషించారు. కరోనాను ఎదుర్కోవడానికే కాదు మరోవైపు లాక్‌డౌన్‌తో ఉపాధి లేక నెలల తరబడి ఇళ్లకే పరిమితమైన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను సమర్థంగా చేర్చిన సంగతి ప్రజలు మరచిపోలేరు. ప్రభుత్వంపై ప్రజలకు గట్టి నమ్మకం కలిగేలా పనిచేస్తున్న వలంటీర్ల వ్యవస్థను చూసి ఇప్పుడు కొంతమందికి కన్నెర్రగా మారింది. వారెప్పుడూ కనీవినీ ఎరగని రీతిలో పనిచేస్తుంటే జీర్ణించుకోలేకపోతున్నారు. అంతకన్నా అద్భుతమైన వ్యవస్థను ఎలాగూ సృష్టించడం చేతగాక తమ రాజకీయ మనుగడ కోసం దాన్ని నిర్వీర్యం చేయడానికి పూనుకున్నారు. ఎక్కడో ఏదో మూల సముద్రంలో కాకిరెట్టంత తప్పు జరిగిందని భూతద్దంలో చూపిస్తున్నారు. తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. ఏవైనా తప్పులు ఉంటే సూచనలు ఇవ్వాల్సింది పోయి ఆ వ్యవస్థపైనే నీచంగా మాట్లాడుతూ వారి గౌరవాన్ని వారే తగ్గించుకుంటున్నారు.

సంతృప్తికర స్థాయిలో సంక్షేమ పథకాలు...

రాష్ట్రంలో 2014 నుంచి 2019 వరకూ సాగిన చంద్రబాబు పాలనలో ఇబ్బందులు పడిన ప్రజలకు సాంత్వన కలిగించడానికి ఏయే సంక్షేమ కార్యక్రమాలు చేస్తానని పాదయాత్రలో వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారో అవన్నీ సంతృప్తికర స్థాయిలో అమలుచేశారు. నాడు సంక్షేమ పథకాలను తమవర బేధాలతో అమలుచేశారు కాబట్టే మేము ఏ ఆందోళన చేపట్టినా ప్రజలు పోటెత్తేవారు. జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రకు తరలివచ్చేవారు. గోదావరి సాక్షిగా రాజమండ్రి బ్రిడ్జిపై ఆ కొస నుంచి ఈ కొస వరకూ జనం కిక్కిరిసిపోవడమే అద్భుత దృశ్యం. అలాంటి సన్నివేశం ఇప్పుడు టీడీపీ నాయకుల కార్యక్రమాల్లో ఎక్కడా కనిపించట్లేదు. ఇరుకు సందుల్లో, చిన్న రోడ్లపై సభలు పెట్టుకుంటూ గ్రాఫిక్స్‌లో జనాన్ని చూపించుకోవాల్సిన దుస్థితి వారిది. ప్రజలు అవకాశం ఇచ్చిన ఐదేళ్ల కాలంలో ఏం చేశారో చెప్పుకోలేని చంద్రబాబు పాలనకు, ప్రతి కుటుంబానికి తాము చేశామో గడపగడపకూ వెళ్లి ధైర్యంగా చెబుతున్న జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు నక్కకు నాకలోకానికి ఉన్నంత తేడా ఉంది.

సకాలంలో పుస్తకాలు



గుర్ల మండలం పెదబంటుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు అందజేస్తున్న ఉపాధ్యాయులు, సర్పంచ్ సతీష్, తదితరులు

- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సెమిస్టర్–2 పాఠ్యపుస్తకాల పంపిణీ
- 27 మండలాల్లో 14 మండలాల్లో పంపిణీ శతశాతం పూర్తి

నాడు ప్రభుత్వ బడులన్నా, పేద కుటుంబాల పిల్లల చదువులన్నా చులకన భావం. మౌలిక సదుపాయాలను పక్కనపెడితే.. విద్యాభ్యాసనకు, బోధనకు ప్రధాన ఆధారమైన పుస్తకాలనూ సరిగా పంపిణీ చేయని దుస్థితి. పాఠశాలలకు అసలు పుస్తకాలు ఎప్పుడు వస్తాయో తెలియదు. సరైన ప్రణాళికా ఉండేది కాదు. పుస్తకాల కోసం ఉపాధ్యాయులు వాకబు చేస్తే ఉన్నత విద్యాశాఖాధికారుల నుంచి సమాధానం శూన్యం. పాత పాఠ్యపుస్తకాలను విద్యార్థులు సేకరించుకోగలిగితే సరి.. లేదంటే చదువు సాగని పరిస్థితి.

నేడు పాఠశాలల పునఃప్రారంభం రోజునే జగనన్న విద్యాకానుక కింద విద్యాభ్యసన సామగ్రి పంపిణీ. నాడు–నేడు కింద పాఠశాలలకు ఆధునిక సొబగులు. పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకునేలా ఇంగ్లిష్, తెలుగు మాధ్యమాల్లో ముద్రించిన పుస్తకాలను సెమిస్టర్ వారీగా సకాలంలో పంపిణీ. డిజిటల్ చదువుల దిశగా ట్యాబ్‌ల అందజేత. పేదకుటుంబాల పిల్లలు ఉజ్వల భవిష్యత్తుకు పాఠశాల స్థాయిలో గట్టి పునాది. ప్రభుత్వ లక్ష్యం మేరకు బోధన సాగిస్తున్న ఉపాధ్యాయ యంత్రాంగం.

విజయనగరం అర్బన్:

ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిస్తోంది. పేదకుటుంబాల పిల్లలు ఆర్థిక సమస్యలతో చదువుకు దూరంకాకూడదన్న ఉద్దేశంతో వివిధ పథకాల కింద సాయంఅందజేస్తోంది. పుస్తకాలను సకాలంలో పాఠశాలలకు చేర్చుతూ విద్యాభ్యసనకు సహకారం అందిస్తోంది. అందులో భాగంగానే విజయనగరం జిల్లాలో పుస్తకాల పంపిణీ వారం రోజులుగా జోరుగా సాగుతోంది. పాఠశాలల ప్రారంభం రోజునే జగనన్నవిద్యాకానుకల్లో భాగంగా తొలిసెమిస్టర్ పుస్తకాలను ప్రభుత్వం అందజేసింది. తాజాగా, అక్టోబర్‌లో ప్రారంభం కానున్న రెండో సెమిస్టర్ అభ్యసన పుస్తకాలను ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులందరికీ ముందుగానే సమకూర్చింది. పుస్తకాల పంపిణీలో ఎంఈఓలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు భాగస్వాములవుతున్నారు. విద్యార్థుల చదువుకు ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరిస్తున్నారు. భవిష్యత్తును బంగారం చేసుకోవాలని సూచిస్తున్నారు. జిల్లాలోని 27 మండలాల్లో 14 మండలాల విద్యార్థులకు శతశాతం పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. మిగిలిన మండలాల విద్యార్థులకు సోమవారం అందజేస్తామని విద్యాశాఖాధికారులు తెలిపారు.

పుస్తకాల పంపిణీ ఇలా..

మండలం	వచ్చిన పుస్తకాలు	పంపిణీ చేసినవి
ఆర్.ఆముదాలవలస	17,104	17,104
రాజాం	16,754	16,754
సంతకవిటి	13,537	12,876
వంగర	9,318	9,318
బాడంగి	9,115	9,115
భోగాపురం	14,534	14,534
బొబ్బిలి	21,045	15,534
బొండపల్లి	10,474	10,474
చీపురుపల్లి	15,778	15,778
దత్తిరాజేరు	10,580	10,513
డెంకాడ	12,421	12,047
గజపతినగరం	10,505	10,505
గంట్యాడ	12,042	12,042
గరివిడి	14,032	10,513
గుర్ల	15,390	15,390
జామి	9,101	9,101
కొత్తవలస	10,660	10,582
ఎల్.కోట	9,391	8,693
మెంటాడ	9,872	9,872
మెరకముడిదాం	13,148	10,433
నెల్లిమర్ల	21,305	21,305
పూసపాటిరేగ	19,553	19,533
రామభద్రపురం	12,802	11,578
ఎస్.కోట	11,688	10,419
తెర్లాం	12,162	11,703
వేపాడ	8,374	7,935
విజయనగరం	44,229	44,229

ఎల్.కోటలో చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఎల్.కోట మండలం రేగ గ్రామంలోని చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్

- 25న క్యాంప్ కార్యాలయం నుంచి ప్రారంభించనున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

విజయనగరం అర్బన్: జిల్లాలో చిరుధాన్యాల సాగును ప్రోత్సహించడంలో భాగంగా ఎల్.కోట మండలం రేగ గ్రామంలో ఏర్పాటుచేసిన చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్‌ను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 25న ప్రారంభించనున్నారు. ఉదయం 11 గంటలకు తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి ఆన్‌లైన్‌లో ప్రారంభిస్తారు. రూ.4 కోట్ల వ్యయంతో ఏర్పాటుచేసిన యూనిట్ వల్ల 20 మందికి ఉపాధి కల్పనతోపాటు ఈ ప్రాంతంలో చిరుధాన్యాలు సాగుచేస్తున్న వెయ్యి మంది రైతులకు ప్రయోజనం కలగనుంది. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద ఏర్పాటవుతున్న యూనిట్ ప్రారంభోత్సవ కార్యక్రమం కోసం అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజన్ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు.

పోలీస్ సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- ఎస్పీ దీపిక
- 1469 మంది పోలీసులకు ఉచిత వైద్యపరీక్షలు



డాక్టర్ తిరుమల ప్రసాద్‌ను సత్కరిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: సరైన ఆహారపు అలవాట్లు, వ్యాయామంతో ఆరోగ్యంగా జీవించాలని ఎస్పీ ఎం.దీపిక పోలీస్ సిబ్బందికి సూచించారు. తిరుమల మెడికవర్ ఆస్పత్రి సహకారంతో 1469 మంది పోలీసులకు ఉచిత వైద్యపరీక్షలు చేయించామన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఇటీవల కాలంలో పోలీస్ ఉద్యోగులు ఆరోగ్యపరమైన సమస్యలతో ఇబ్బందులు పడడం, చిన్నవయసులోనే మృతిచెందడం ఆందోళన కలిగించిందన్నారు. పోలీస్ ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న పోలీసులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య సమస్యలతో బాధపడేవారికి కోలుకునేలా వైద్యసేవలు అందించాలని నిర్ణయించామన్నారు. దీనికి డాక్టర్ కె.తిరుమలప్రసాద్ సానుకూలంగా స్పందించి, వారంలో మూడురోజులు పోలీస్ కార్యాలయంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు అంగీకరించారన్నారు. గతనెల ఆరో తేదీ నుంచి రోజుకు వంద మంది చొప్పున ఇప్పటి వరకు 1469 మంది పోలీసులకు వైద్య పరీక్షలు చేశారన్నారు. వీరిలో 614 మంది సివిల్, 399 మంది ఆర్మ్‌డ్ రిజర్వు, 101 మంది పోలీస్ శిక్షణ కళాశాల, 269 మంది హోంగార్డులు, 27 మంది జిల్లా పోలీసు కార్యాలయం ఉద్యోగులు, ఇంటిలిజెన్స్, ఏసీబీ, ఎస్ఈబీ ఇతర అనుబంధ విభాగాలకు చెందిన పోలీసులు ఉన్నారన్నారు. వీరిలో ఒకరికి బైపాస్ సర్జరీ, మరో ఇద్దరికి ఏంజియోగ్రామ్ పరీక్షలు నిర్వహించి, వైద్యుల పర్యవేక్షణలో చికిత్సను అందిస్తున్నట్టు వెల్లడించారు.

అనంతరం పోలీస్ సిబ్బందికి వైద్యపరీక్షలతో పాటు ఆరోగ్యపరమైన సలహాలు, సూచనలను అందజేసిన డాక్టర్ కె.తిరుమల ప్రసాద్, గైనకాలజిస్ట్ డాక్టర్ కృష్ణ శాంతి, హృద్రోగ నిపుణులు డాక్టర్ శరత్ కుమార్ పాత్రో, డాక్టర్ చంద్రకుమారి, డాక్టర్ వి.ఎన్.పద్మకుమార్‌ను ఎస్పీ దుశ్శాలువతో సత్కరించారు. పోలీస్ శాఖ తరఫున జ్ఞాపికలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ (అడ్మిన్) అస్మా ఫర్హీన్, సెంటర్ హెడ్ పద్మకుమార్, ఏఓ పి.వి.నారాయణరావు, ఎస్బీ సీఐ విజయనాథ్, తదితరులు పాల్గొన్నారు.

బాలాజీ మార్కెట్‌లో అగ్ని ప్రమాదం



ఎగిసి పడుతున్న అగ్ని కీలలు

విజయనగరం క్రైమ్: స్థానిక కంటోన్మెంట్‌లో ఉన్న బాలాజీ మార్కెట్‌లో శనివారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో షాపు నెంబర్ 216, 217లో పైన ఉన్న రెండు గదులలో ఉన్న దుస్తులన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. మంటల తీవ్రత మరో రెండు షాపులకు విస్తరించింది. వ్యాపారస్తులు వెంటనే అగ్నిమాపక అధికారులకు సమాచారమందించారు. రెండు వాహనాల్లో అగ్నిమాపక అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని రెండు గంటల పాటూ శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. పరిసర ప్రాంతాల్లో ఉన్న షాపులన్నీ పూర్తిగా పొగమయయ్యాయి. సుమారు కోటి రూపాయల వరకూ ఆస్తి నష్టం వాటిల్లినట్టు నిర్వాహకులు చెబుతున్నారని ఏడీఎఫ్‌వో సోమేష్ తెలిపారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు(100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం

బంగారం(24సి. 10గ్రా.)	60,160-00
బంగారం(22సి. 10గ్రా.)	55,150-00
వెండి (కిలో)	80,500-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹220

జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు పరామర్శ



జెడ్పీ చైర్మన్ తండ్రి నర్సింగరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్

విజయనగరం: జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును పలువురు ప్రజాప్రతినిధులు శనివారం పరామర్శించారు. జెడ్పీ చైర్మన్ తండ్రి మజ్జి నర్సింగరావు ఇటీవల మరణించడంతో ఎంపీ బెల్లాన సుధాకర్, ఎమ్మెల్యే కంబాల జోగులు,ఎమ్మెల్సీలు పెను మత్స సురేష్‌బాబు, వేపాడ చిరంజీవిరావు, రా ష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సు ధాకర్, మాజీ ఎమ్మెల్యే శోభా హైమా వతి ప్రదీప్‌నగర్‌లోని ఆయన నివాసంలో పరామర్శించి తమ సానుభూతి తెలిపారు. జిల్లా యాదవ సంఘం సభ్యులు పడగల బంగార్రాజు ఆధ్వర్యంలో జిల్లా తప్పెటగుళ్ల కళాకారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సరాబోని శంకరరావు తన కళాకారుల బృందంతో కలిసి వచ్చి నర్సింగరావు మృతి పట్ల సంతాపం తెలిపారు.

భవనం పైనుంచి జారిపడి వ్యక్తి మృతి



పీహెచ్‌సీ వద్ద మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ చంద్రశేఖర్

కొత్తవలస : మండల కేంద్రంలోని భారత్ డిఫెన్స్ అకాడమి సమీపంలో గల ఒక భవనం మూడో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి మధ్య ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బస్స్ బహదూర్‌సింగ్(29) శనివారం మృతి చెందాడు. ఎస్‌ఐ వీరజనార్దన్ తెలిపిన వివరాలు.. కంటకాపల్లి నుంచి కొర్లాం మధ్యలో జరుగుతున్న జాతీయ రహదారి పనులకు మధ్యప్రదేశ్ నుంచి కొందరు కార్మికులు ఇక్కడకు వచ్చారు. కొత్తవలస మండల కేంద్రంలోని భారత్ డిఫెన్స్ అకాడమి సమీపంలోని ఒక భవనంలో అద్దెకు ఉంటున్నారు. శనివారం మధ్యాహ్నం మృతుడు మూడో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి గ్రౌండ్ ఫ్లోర్‌లో పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన బహదూర్‌సింగ్‌ను స్థానిక పీహెచ్‌సీకి తోటి కార్మికుల సాయంతో తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. హైవే రోడ్డు నిర్మాణ పనుల సూపర్‌వైజర్ బి.అవతారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ వీరజనార్దన్ తెలిపారు. మృతుడికి భార్య, ఐదేళ్ల బాబు ఉన్నారు.

పూలు కోస్తుండగా చైన్ స్నాచింగ్

పార్వతీపురం టౌన్ : పట్టణంలో చైన్ స్నాచింగ్ సంఘటన శనివారం వేకువ జాయున చోటు చేసుకుంది. పట్టణ ఎస్‌ఐ దినకర్ తెలిపిన వివరాలు.. పట్టణంలోని రామానంద్ నగర్ కాలనీకి చెందిన దాసరి సత్యమణి వేకువజామున పూలు కోస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి తన మెడలో ఉన్న రెండు తులాల బంగారు చైన్ లాక్కుని పారిపోయాడని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

25 వరకు ధ్రువపత్రాల పరిశీలన

నెల్లిమర్ల రూరల్: పట్టణంలోని వేణుగోపాలపురం డైట్ కళాశాలలో ఈ నెల 25 వరకు ధ్రువపత్రాలను పరిశీలించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్. తిరుపతినాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 – 25 విద్యా సంవత్సరంలో డైట్‌లో చేరబోయే విద్యార్థులు గమనించాలని సూచించారు. వేణుగోపాలపురం డైట్‌తో పాటు ప్రగతి డీఈడీ కళాశాలల్లో సీట్లు పొంది ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కాని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఈ నెల 26 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.